ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





గంజాయ్.. యువత జోగుతోంది. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతోంది. చదువుకునే విద్యార్థులు కూడా బానిసలుగా మారారు. గతంలో ఎక్కడో మారుమూల రహస్యంగా తాగడం, విక్రయించడం జరిగేది. కానీ వైసీపీ హయాంలో గంజాయి తాగడం, విక్రయించడం అనేవి విచ్చలవిడిగా మారాయి. గొడవలు, ఘర్షణలు చివరకు హత్యలు, అత్యాచారాలకు గంజాయే కారణమని పలువురు వాపోయినా నాటి పాలకులకు పట్టలేదు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గంజాయి మహమ్మారిని ఓ సవాల్‌గా స్వీకరించింది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి పదుల కేజీల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నా.. ఆ మహమ్మారి ఇంకా వేళ్లూనుకునే ఉంది. నాటి ప్రభుత్వంలో గంజాయిని విచ్చలవిడి చేయగా నేడు కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం హోం మంత్రి అనిత ఎస్పీలతో దీనిపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఎస్పీలు రంగంలోకి దిగి గంజాయి మత్తును వదిలించాలని ఆదేశాలు జారీ చేశారు.

గంజాయి.. సవాల్

నాడు విచ్చలవిడి.. నేడు కట్టడికి చర్యలు

- వైసీపీ హయాంలో విస్తరించిన మహమ్మారి
- గంజాయిమయంగా ఉమ్మడి గుంటూరు జిల్లా
- విద్యాసంస్థలు సహా అన్ని చోట్ల యథేచ్ఛగా విక్రయాలు
- రోజూ పదుల సంఖ్యలో కేసులు నమోదు.. పలు అరెస్టులు
- హోంమంత్రి అనిత సమీక్షతోనైనా గంజాయి మత్తు వదిలేనా

కొరవడిన తనిఖీలు

గతంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టేది. వైసీపీ ప్రభుత్వం ఎస్ఈబీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి హడావుడి చేయడం తప్ప మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలేవీ లేవు. గతంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలే సమర్థవంతంగా గంజాయి విక్రయాన్ని నియంత్రించాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వారం వారం తనిఖీలు నిర్వహించి గంజాయి, తదితర మత్తు పదార్థాలను పట్టుకునేవారు. అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో గంజాయిని తరలించడానికి ప్రయత్నించినా ప్రభుత్వ యంత్రాంగం కన్ను గప్పి తరలించడం సాధ్యమయ్యేది కాదు. కానీ వైసీపీ వచ్చాక నేరుగా అధికార పార్టీ నేతలు, కార్య కర్తలే ఈ అక్రమాల్లో భాగస్వాములయ్యా రు. దీంతో అధికారులు కూడా చూసీ, చూడనట్లు వ్యవహరించడం మొదలు పెట్టారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా గంజాయి హబ్‌లా మారిపోయింది.

కేసులు పెట్టినా.. తగ్గేదేలేదు

రెండు మూడు నెలల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అంత వరకు గంజాయి విషయంలో పట్టీపట్టనట్లుగా ఉన్న పోలీసులు జూలు విదిల్చారు. గంజాయి విక్రయాలను కట్టడి చేసేందుకు దాడులు, అరెస్టులకు రంగంలోకి దిగారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ప్రతి రోజూ పదుల సంఖ్యలో గంజాయి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పోలీసులు కేసులు పెట్టడం, నిందితులను అరెస్టు చేయడం, మళ్లీ గంజాయి విక్రయాలు జరగడం, మళ్లీ అరెస్టులు చేయడం.. సర్వసాధారణంగా మారింది. కేసులు పెడుతున్నా గంజాయి విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. కేసుల దారి కేసులదే.. తమ దారి తమదే అన్నట్లుగా గంజాయి విక్రయదారులు చెలరేగి పోతున్నారు.



ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ముగ్గురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు నియోజకవర్గ పర్యటనల్లో గంజాయి సమస్యపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా గంజాయి గురించే ప్రజలు ఎమ్మెల్యేల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్నారు. గంజాయి మత్తులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని వివరిస్తున్నారు. మొత్తం మీద కూటమి ఎమ్మెల్యేలకు గంజాయి సమస్య షాకుల మీద షాకులు ఇస్తోంది. స్థానిక సమస్యల కంటే అధిక సంఖ్యలో గంజాయి సమస్యపై ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గంజాయి నియంత్రణ కోసం ఎమ్మెల్యేలు, పోలీసు యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా గంజాయి విక్రేతలు సవాలు విసురుతున్నారు. గంజాయి సమస్య పరిష్కారం కోసం ఏకంగా జిల్లా ఎస్పీలకు ఎమ్మెల్యేలు కూడా ఫిర్యాదులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి పడగ విప్పి బుసలు కొడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా మహమ్మారి విస్తరించింది. వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విక్రయాలపై కనీసస్థాయి నియంత్రణ కూడా లేకపోవడంతో ఎక్కడంటే అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200కి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కళాశాల సమీపంలో ఉండే చిన్న చిన్న బడ్డీ కొట్లు, కూడళ్లను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రేతలు చెలరేగిపోతున్నారు. సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లి గంజాయి విక్రయాలకు కేంద్ర బిందువుగా మారినా నాటి పాలకులకు పట్టలేదు. అత్యాచారాలు, హత్యలు చోటుచేసుకున్నా ప్రభుత్వంలో స్పందనలేదు. మంగళగిరి, తాడేపల్లిలో స్కూలు, కళాశాల స్థాయి విద్యార్థులను సైతం గంజాయి విక్రేతలు వదల్లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కిందటేడాది తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన ముగ్గురు ఇంటర్మీడియట్ విద్యార్థులు గంజాయి మత్తులో కృష్ణాయపాలెం వంతెన వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మరణించారు. కాగా గుంటూరులో గంజాయి దొరకని వీధి లేదంటే ఆశ్చర్యం లేకపోవచ్చు. ప్రతి డివిజన్లో ఏదో మూల గంజాయి దొరుకుతోంది. స్వర్ణభారతినగర్ ప్రాంతంలో గంజాయి విక్రయాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఎన్నికలకు ముందు ఓ మహిళ ఢిల్లీకి వెళ్లి బొటన వేలు కోసుకున్న విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ మహమ్మారి గుంటూరులో అల్లుకుపోయిందని అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించినా నాటి ప్రభుత్వంలో స్పందనలేదు. పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, అమరావతి, క్రోసూరు, నరసరావుపేట, పిడుగురాళ్ల మైదాన ప్రాంతాల్లో కూడా గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యాటక ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, చీరాల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో గంజాయి విచ్చల విడిగా దొరుకుతోంది. ఒకప్పుడు నాటుసారా విక్రయాలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు గంజాయి యథేచ్ఛగా అందుబాటులో ఉంది. బాపట్ల, చీరాలలోని విద్యా సంస్థలను టార్గెట్ చేసి గంజాయి విక్రేతలు విద్యార్థులను గంజాయికి బానిసలుగా చేస్తున్నారు. వీటిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, అధికార యం త్రాంగం గంజాయి నిర్మూలనకు ప్రయత్నిస్తోంది. కానీ గంజాయి అడుగడుగునా సవాలు విసురుతోంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం హోంమంత్రి అనిత ఎస్పీలతో జరిగిన సమీక్షలో గంజాయి కట్టడి ప్రధాన అంశమైంది. గంజాయి మత్తును వదిలించేందుకు కఠిన చర్యలు తీసు కోవాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితు ల్లో గంజాయి కట్టడి అవుతుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద పోలీసులు అరెస్టు చేసిన గంజాయి విక్రయదారులు (ఫైల్)

- సరిగ్గా వారం క్రితం మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో పోలీసు అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు వారం ముందు తాడేపల్లిలో భారీ స్థాయిలో గంజాయిని, విక్రయించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- వారం క్రితం సత్తెనపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు కిలో గంజాయిని రూ.3 వేలకు విక్రయిస్తున్నాడు. అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన ఒకరి వద్ద 10 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలం హసనాబాద్‌లో ఓ మహిళ వద్ద 300 గ్రాముల గంజాయి దొరికింది.

అరెస్టుల పరంపర ఇలా..

- నెల రోజుల క్రితం పల్నాడు జిల్లా మాచర్లలో 32 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సాగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి దొరికింది.
- ఈ నెల 14న పెనుమూడి వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు మార్చిలో 457 కేజీల గంజాయిని బాపట్ల శివారులో పోలీసులు పట్టుకున్నారు.



తెనాలి : గంజాయితో పట్టుబడిన నిందితుల వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు(ఫైల్)

నేతలకే యార్డు దుకాణాల అద్దెలు

అధికార పార్టీకి ఆదాయ వనరుగా షాపింగ్ కాంప్లెక్స్

- ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారిదే నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మార్కెట్‌యార్డు దుకాణాలు నిర్మించింది. వాటి ఆదాయం కూడా మార్కెట్‌యార్డుకు వెళ్లాలి. కానీ నరస రావుపేటలో అలా కాదు. అధికారం ఏ పార్టీది అయితే ఆ పార్టీకి చెందిన నేతలకే వెళ్తుంది. మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ అధికార పార్టీ నేతల జేబు సంస్థగా మారిందంటే ఆశ్చర్యంకాదు. అధికార పార్టీ నేతలకు అధికారులు సహకరిస్తూ వస్తుండటంతో కొన్నేళ్లుగా మార్కెట్ యార్డు రూ.కోట్లలో అద్దెల



మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్

ఆదాయాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 15 ఏళ్ల క్రితం నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మార్కెట్ యార్డు 39 షాపులను నిర్మించింది. షాపుల లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల ప్రయోజనాలకు వెచ్చించాల్సి ఉంది. అయితే ఈ షాపులను రాజకీయ పార్టీలు హస్తగతం చేసుకుని యార్డు ఆదాయానికి గండి కొడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన కాంప్లెక్స్‌లో షాపులను కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు కట్టబెట్టింది. అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ వ్యక్తులను ఖాళీ చేయించి ఆ పార్టీ క్యాడర్‌కు షాపులకు కేటాయించింది. వైసీపీ హయాంలో గత ఐదేళ్లు మార్కెట్ యార్డు కాంప్లెక్స్‌లోని షాపులను నేతలకు కేటాయించింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ కాంప్లెక్స్‌పై కన్నేసిందన్న విమర్శలు వస్తున్నాయి. అధికారం మారగానే కొన్ని షాపులకు టీడీపీ నేతలు తాళాలు వేయడం గమనార్హం.

పదిహేనేళ్లుగా అద్దెల దందా..

ఐదేళ్ల క్రితం దుకాణాల లీజులకు యార్డు అధికారులు వేలం నిర్వహించారు. వేలంలో ఎవరు పాల్గొనకుండా వైసీపీ శ్రేణులు అడుకున్నారు. అనంతరం అతి తక్కువ లీజుకు షాపులను ఆ పార్టీ నేతలు దక్కించుకున్నారు. కొన్ని షాపులు ఒక్కొక్కటి రూ.2,904, మరి కొన్ని రూ.2,500కు చొప్పున వైసీపీ నేతలు లీజుకు తీసుకున్నారు. గతంలో ఇదే తరహాలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు వారు అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు షాపులను లీజుకు తీసుకున్నారు. ఈ సెంటర్‌లో షాపులకు మంచి గిరాకీ ఉంది. తక్కువ లీజుకు షాపులు తీసుకున్న నేతలు సబ్ లీజుకు ఇస్తున్నారు. కొన్ని షాపులకు రూ.25 వేల చొప్పున అద్దె పలుకుతోంది. ఈ అక్రమ లీజుల దందా 15 ఏళ్లుగా సాగుతోంది. ఈ అక్రమాలకు మార్కెట్ యార్డు ఉన్నతాధికారులు అడ్డుకోలేకపోతున్నారు. షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తే యార్డుకు నెలకు సగటున రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. యార్డు కార్యదర్శి ఆంజనేయులను వివరణ కోరగా షాపులకు సంబంధించి ఐదేళ్లు లీజు చెల్లించలేదని చెప్పారు. వీరికి నోటీసులు జారీ చేశామని, షాపు లను స్వాధీనం పరుచుకున్నామని తెలిపారు. లీజు చెల్లించని వారిపై చర్యలు కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

వెయిటింగ్‌లో.. తహసీల్దార్లు

- 24 మందికి దక్కని పోస్టింగ్‌లు
- 28 మండలాల్లో పోస్టులు ఖాళీ
- పోస్టింగ్‌ల్లో సిఫార్సులకే ప్రాధాన్యం

నరసరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 28 మండలాలకు తహసీల్దార్లు లేరు. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారు ఇటీవల తిరిగి జిల్లాకు వచ్చారు. అయితే వారికి పోస్టింగ్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో మండలాల్లో తహసీల్దార్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖల జారీలో జాప్యంతోనే తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇతర జిల్లాలో విధులు నిర్వహిస్తూ అక్కడ రిలీవై కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేసిన 24 మంది తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలోని తహసీల్దార్లను ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు బదిలీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల నుంచి తహసీల్దార్లను రిలీవ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో విధులు నిర్వహించిన తహసీల్దార్లు ఇక్కడి నుంచి రిలీవయ్యారు. ఎన్నికల ముందు ముగ్గురు తహసీల్దార్లు ఉద్యోగోన్నతితో బదిలీపై వెళ్లారు. ఎన్నికల ముందు నుంచే ఒక మండలంలో తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జిల్లాలో 28 మండలాలకు తహసీల్దార్లు లేరు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు కూడా కొందరు తహసీల్దార్లు సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం. మరి కొందరికి సిఫార్సు లేఖలు లేవు. పోస్టింగ్‌లకు ఎమ్మెల్యే సిఫార్సు లేఖ తప్పనిసరి అని ఉన్నతాధికారులు సూచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇతర జిల్లాల నుంచి రిలీవై వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పట్లో తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చే పరిస్థితులు లేవన్న విమర్శలున్నాయి. 28 మండలాలకు తహసీల్దార్ల నియామకం ఎప్పటికి చేస్తారో చూడాలి. కీలకమైన ఈ పోస్టులను ఖాళీగా ఉంచడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుంటేనే వీరి నియామకాలు జరుగు తాయన్న ప్రచారం ఉంది.

భోజన పథకం అమలులో..

- తిమ్మాపురం పాఠశాలలో కలెక్టర్ అరుణ్‌బాబు తనిఖీ

అలసత్వం సహించం

తిమ్మాపురం(యడ్లపాడు), జూలై 30 : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లు, స్టాక్ పాయింట్లును పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో తొమ్మిది మంది విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టకపోవడాన్ని గమనించి మధ్యాహ్న పథకం నిర్వాహకులను, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాయుడును ప్రశ్నించారు. కోడిగుడ్లు పాడవడం వలన ఇవ్వలేకపోయినట్లు తెలపటంతో నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడైన గుడ్లను తెప్పించాలని ఆదేశించారు. రికార్డులకు అనుగుణంగా భోజన వస్తువులు ఉన్నాయో లేదో పరిశీలించాలని తహసీల్దార్ ఆఫ్రషున్నీసాబేగం, ఎంపీడీవో శ్రీనివాసరావులకు సూచించారు. అక్కడి నుంచి పాఠశాలలోని ఆర్వో ప్లాంటు వద్దకు చేరుకుని దానిని పరిశీలించిన కలెక్టర్ అది పనిచేయకపోవడంపై ఆరా తీశారు. మరమ్మతులకు గురైందని తెలపడంతో వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాల్సిందేనన్నారు. పథకం నిర్వహణలో లోపాలు లేకుండా, ఫిర్యాదులకు తావులేకుండా నిర్వహించాలన్నారు. ఎంఈవోలు నాగరత్నం, అరుణకుమారి, పీఆర్ డీఈఈ శ్రీనివాస్, సీడీపీవో శాంతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు సరిపడ పంపిణీ చేయకపోవడంపై నిర్వాహకులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rdmwKnPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Mohan T Advani Centennial Scholarship

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?


నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం



వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది. అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

> హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



నవ్య | చిత్రజ్యోతి

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్ల ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లూ నంది పురస్కారాల అంశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపు ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రధానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరఫున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేద'నేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మల్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరఫున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరఫున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను



విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ ఆయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతినాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.



ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్క రోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.
- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జీడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

> సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- మున్ముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.
- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐబీటీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.

> కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను.



జాతీయ ర్యాంకులను చూపుతున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు, అధికారులు

నాగార్జున విశ్వవిద్యాలయానికి జాతీయ ర్యాంక్

పెదకాకాని, జులై 30: ఇండియా టుడే-ఎండీఆర్‌ఏ బెస్ట్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జనరల్ కేటగిరిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 12వ ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ర్యాంక్‌ల వివరాలను మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ రెప్యుటేషన్ అండ్ గవర్నెన్స్, అకడమిక్ అండ్ రీసెర్చ్ ఎక్సలెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లివింగ్ ఎక్స్‌పీరియన్స్, పర్సనాలిటీ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్రోగ్రెషన్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధారంగా ఇండియా టుడే - ఎండీఆర్‌ఏ ర్యాంకులను కేటాయించినట్లు ఇన్‌చార్జ్ వీసీ పేర్కొన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకు సాధ్యమైందన్నారు. ఇటువంటి ర్యాంకుల ద్వారా విశ్వవిద్యాలయ కీర్తి మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్. కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి.రవి కుమార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవి కుమార్, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్. వి.వెంకటేశ్వర్లు ర్యాంకుల విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డాక్టర్ బ్రహ్మాజీరావు

పెదకాకాని, జూలై 30: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ రేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డాక్టర్ పి.బ్రహ్మాజీరావు (పర్యావరణ శాస్త్రం) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక ఉత్తర్వులను బ్రహ్మాజీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావుకు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రవేశాలకు సంబంధించి అన్నిరకాల చర్యలు తీసుకుంటానని, శక్తివంచన లేకుండా కృషిచేసి వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

యూజీ పరీక్షల ఇన్చార్జి కో ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ కృష్ణారావు

పెదకాకాని, జూలై 30 ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ (యూజీ) పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎన్వీ కృష్ణారావు (తెలుగు) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్వీ కృష్ణారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వీసీ గంగాధర్‌రావుకు, రెక్టార్, రిజిస్ట్రార్లకు ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలు కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 30: సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం మంగళవారం నాటికి 517.20 అడుగులు ఉంది. ఇది 144.21 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 5944 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6744 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,55,716 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి

మేడికొండూరు జూలై 30: మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పాములపాటి సాంబశివరావు(45) విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతి చెందాడు. ఇంట్లో మంచినీటి మోటారు దగ్గర పనిచేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మృతుడు సాంబశివరావు

సూపర్ చైర్మన్‌కి చేదు అనుభవం

● వైసీపీఎమ్మెల్యే పీఏగా పనిచేసిన ఉద్యోగీకి జడ్పీ షాక్.. ● నంద్యాల పంపేందుకు అనుమతి నిరాకరణ



గుంటూరు సిటీ, జూలై 30 : ఆయన జిల్లా పరిషత్(జడ్పీ) ఉద్యోగి. కాలం కలిసొచ్చి గత ప్రభుత్వంలో పల్నాడు వైసీపీ ఎమ్మెల్యే పీఏగా వెళ్లాడు. అంతే. జిల్లా పరిషత్‌ను తన అదుపు ఆజ్ఞల్లోకి తీసుకున్నాడు. ప్రజలు ఎన్నుకున్న చైర్మన్‌ను పక్కన పెట్టి, తానే సూపర్ చైర్మన్‌గా వ్యవహరించాడు. చివరకు మాతృ సంస్థలోని ఉన్నత అధికారులకు సైతం ఆదేశాలు జారీచేసి మరీ పనులు చేయించాడు. అంతటితో ఆగక జిల్లా పరిషత్‌లో ఉద్యోగం చేస్తున్న ఒక సామాజిక వర్గానికి తీరని ద్రోహం చేసాడు. వెంటాడి మరీ ఆ వర్గానికి చెందిన ఉద్యోగులను జిల్లా మారుమల ప్రాంతాలకు బదిలీ చేయించాడు. చివరకు విడో అన్న కనికరం కూడా లేకుండా మహిళా ఉద్యోగులను సుదూర ప్రాంతానికి బదిలీ చేయించాడు. ఒకానొక సందర్భంలో చివరకు జిల్లా పరిషత్‌లోని అతి ముఖ్యమైన వ్యక్తులను కూడా చెప్పింది చేయండి.. లేకపోతే ఇక్కడ ఉండరు .అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు . జిల్లా పరిషత్‌కు ఏ అధికారి బదిలీ పై రావాలన్నా సదరు ఉద్యోగి దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడాల్సిన పరిస్థితిని కల్పించాడు. అటు నియోజకవర్గాల్లో అనేక రకాలైన వ్యవహారాల్లో తలదూర్చి అత్యంత వివాదాస్పదమైన విషయాలను చక్కబెట్టాడు. ఎమ్మెల్యే కంటే ముందే జోక్యం చేసుకొని తెలుగు దేశం పార్టీకి చెందిన అనేకమందిని ఇబ్బందులు పెట్టాడు. చివరకు తానే మినీ ఎమ్మెల్యేగా చలామణి అయ్యాడు. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. చేతిలో ఉన్న ఎమ్మెల్యే ఓడిపోయి కష్టాల పాలయ్యారు. పీఏగా వాళ్ళని వీళ్లని అదిరించిన పాపానికి రాజకీయ శత్రువులు ఎక్కువయ్యారు. చేసేది లేక.. ఇక్కడ ఉండలేక ఆ ఉద్యోగి నంద్యాల లో ఉన్న ఎమ్మెల్సీ పీఏగా వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశాడు. చివరకు అక్కడి కలెక్టర్ కూడా అందుకు ఒప్పుకున్నారు. కానీ ఇక్కడి జిల్లా పరిషత్ అధికారులు మాత్రం సదరు ఉద్యోగిని రిలీవ్ చేసేందుకు నేసమిరా అంటున్నారు. ఇక్కడే ఉండాల్సిందే.. వేసిన చోట ఉద్యోగం చేయాల్సిందే అంటున్నారు. ఇప్పుడు జడ్పీలో ఇదే హాట్ టాపిక్ అయ్యింది.

రైళ్ల భద్రతకు ఎస్‌పీఎం యాప్

క్రూ పనితీరుపై ఇక నుంచి సమగ్ర విశ్లేషణ ● స్వల్ప వ్యవధిలోనే సవివరంగా సమాచారం



గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైళ్ల ఆపరేషన్స్‌లో విధులు నిర్వహించే క్రూ(సిబ్బంది) పనితీరుపై ఇక నుంచి సమగ్ర విశ్లేషణ జరగనుంది. ముఖ్యంగా భద్రత, సమయపాలన అంశాల్లో సంబంధిత ఉద్యోగుల పనితీరుని ఎస్‌పీఎం(స్పీడో-మీటర్)యాప్ ద్వారా కొలమానం చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ సొంతంగా ఈ యాప్ ని తయారు చేసి అమలులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రైళ్ల వేగం, బ్రేకింగ్ దూరం, సిగ్నల్ నిబద్ధత వంటివి కూడా పరిశీలించనున్నారు. అలానే పనితీరు మూల్యాంకన ప్రక్రియలో దృశ్య, కంప్యూటర్ నివేదికలు ఈ యాప్ అందించే సమాచారం ఎంతగానో ఉపయోగపడనుంది. స్వల్ప వ్యవధిలో సమగ్ర విశ్లేషణ చేయగలిగే మంచి పరికరంగా ఈ ఎస్‌పీఎం యాప్ మారుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవలకాలంలో తరచుగా రైళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రమాదాల్లో సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతున్నది. చాలా సందర్భాల్లో అనుమతికి మించి లోకో పైలట్లు వివిధ సెక్షన్లలో రైళ్లను వేగం తో నడుపుతున్నారు. అలానే సిగ్నల్ జంపింగ్ అయిన సంఘటనలు కూడా నమోదు అవుతున్నాయి. ఇంకోవైపు పీ-వే సిబ్బంది, స్టేషన్ మాస్టర్లు మాన్యువల్స్‌ని సక్రమంగా పాటించడం లేదు. ఈ విషయంలో వీరితో పాటు పైలట్లు, లోకోపైలట్లకు తరచుగా కౌన్సెలింగ్ చేయాలని హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ అవుతున్నాయి. అయినప్పటికీ ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇటీవల ఒక స్పెషల్ ట్రైన్ విషయంలో గుంటూరు డివిజన్ పరిధిలో సాంకేతిక సమస్య ఉత్పన్నమై ఆ రోజున ఒక్కో రైలు నాలుగు గంటల ఆలస్యంగా నడపాల్సిన పరిస్థితి తలెత్తింది. అలానే గత ఏడాది ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో రెండు బోగీల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొన్నది. మరో సంఘటనలో విష్ణుపురం వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ప్రాణనష్టం జరగకపోయినా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ భద్రత, సమయపాలన విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఈ ఎస్‌పీఎం యాప్‌ని తాజాగా తీసుకొచ్చింది. ఈ యాప్ భద్రతతో పాటు లోకోకు సంబంధించిన వేగం, మొబిలిటీ వంటి అంశాల్లోనూ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఈ యాప్ గురించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్‌ఎం ఎం రామకృష్ణకు వివరించారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఎస్‌పీఎం యాప్‌ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

అమ్మనాన్నలను మరిపించేలా మాచర్లను అభివృద్ధి చేస్తా

● చట్టపరంగా దోషులకు శిక్ష తప్పదు... ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,జూలై 30 : ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన నా తల్లిదండ్రులైన నాగిరెడ్డి,దుర్గాంబలను మరిపించేలా మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ నుంచి అభివృద్ధి మసకబారి అరాచకం,దౌర్జన్యం,భూములు లాక్కోవడం,అక్రమ కేసులు బనాయించి స్టేషన్లలో హింసించడం లాంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తులు చట్టపరంగా శిక్షను అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్లకాలం అధికారంలో వుండి ప్రతిపక్ష నేతలను హింసిద్దామని భ్రమించారని అందుకోసమే విజ్ఞులైన ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పి 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదాలేకుండా చేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సదరు నేతల ప్రవర్తనలో మార్పు రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు.సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరతామని,ఇంటింటికి కుళాయి కనెక్షన్,నిరుపేదలకు నివేశనా స్థలాలతో పాటు గృహాలు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు.డిసెంబర్ మొదటి వారం కల్లా జాతీయ రహదారి పనులు పూర్తవుతాయని చెప్పారు.బుగ్గవాగు రిజర్వాయర్ ఆధునీకరణ, సత్రశాల ఆలయం అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతానన్నారు. పార్టీలో గ్రూపుల గోలొద్దని మనందరం ఒకటే అనే భావంతో వ్యవహరిద్దామని చురకలు వేశారు.ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి,శ్రీనివాసరావు,టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి,రాయపరెడ్డి,రామకృష్ణ,దానయ్య, కృష్ణారెడ్డి,నాళం పెదబాబు,మర్రి రాజ్‌కుమార్,సామ్యేల్, ప్రభురాజ్,మౌలాలి,అప్పయ్య,సిద్దయ్య,మల్లయ్య పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 30 : ఇల్లులేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ. జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చేనాటికి అన్ని శాఖలలో అప్పులు తప్ప ఆదాయ మార్గం కనిపించ లేదన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఐదు కీలకమైన హామీలపై సంతకంచేసి ఒకొక్కటిగా నెరవేర్చుకుంటూ రైతులకు, యువతకు, 60లక్షల మంది అవ్వా తాతలకు, ఉద్యోగులకు లబ్ధి చేకూరే విధంగా అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ఇలా ఒకొక్కటిగా హామీలు నెరవేర్చుకుంటూ పోతున్న ఎన్డీఏ ప్రభుత్వం మరొక కీలకమైన అందరికీ ఇల్లు అనే నిర్ణయం తీసుకుందన్నారు. ఇళ్ల నిర్మాణంలో పేదలు ఇబ్బంది పడకూడదనే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పీఎంఏవై కింద వంద రోజులలో పెండింగ్‌లో ఉన్న లక్ష 25 వేల ఇళ్లను, సంవత్సర కాలంలో 8,25,000 ఇళ్ళను పూర్తిచేసి పేదలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందని వెల్లడించారు.

వ్యాపార అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ అండ

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఖాతాదారులకు పత్రాలను అందజేస్తున్న ఆలపాటి, బ్యాంక్ రీజనల్ హెడ్ జవహర్, ఏజీ జితేందర్

గుంటూరు సిటీ, జూలై 30: చిన్న, మధ్యతరగతి పారిశ్రామిక వేత్తల వ్యాపార అభివృద్ధికి యూనియన్ బ్యాంకు వెన్ను దన్నుగా నిలుస్తుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గుంటూరులోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం జరిగిన మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్మెంట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బ్యాంక్ రీజనల్ హెడ్ ఎస్‌ఎస్ జవహర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ ఎంపవర్ స్కీం కింద రూ.కోటి నుంచి రూ.50 కోట్ల వరకు రుణం ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు తక్షణ ఋణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యాలయ ఏజీఎం జితేందర్, డిప్యూటీ రీజనల్ హెడ్ అశ్వర్థనాయక్, రాజేష్, ఎంఎల్‌పీ ఏజీఎం హరేరామ్‌షా తదితరులు పాల్గొన్నారు.

సిటీ శాఖలో పునర్విభజన అస్తవ్యస్తం

రీజనల్ కార్యాలయాలతో సర్కిల్స్ నిర్వీర్యం

గుంటూరు, జూలై 30: గత వైసీపీ ప్రభుత్వ పెద్దల అనాలోచిత విధానాల కారణంగా వాణిజ్యపన్నులశాఖలో సర్కిల్స్ కార్యాలయాల పనితీరు నిర్వీర్యమైంది. శాఖలో కీలకంగా ఉన్న సర్కిల్ కార్యాలయాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సర్కిల్స్ పుర్విభజన ప్రక్రియ అభాసుపాలైంది. రాష్ట్ర వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియను పునఃపరిశీలించి లోపాలను సరిదిద్దాలని ది సిటీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు. చిలకలూరిపేట, మాచర్ల, అద్దంకి, వినుకొండ లాంటి పట్టణాల్లో సర్కిల్ కార్యాలయాలు ఎత్తి వేశారు. తద్వారా అక్రమ వ్యాపారాలపై నిఘా కొరవడిందని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. కొందరి వైసీపీ నేతల అక్రమ వ్యాపారాలకు అడ్డులేకుండా ఉండేందుకు కొందరు పెద్దలు సర్కిల్ కార్యాలయాలను సైతం ఎత్తివేశారన్న ఆరోపణలున్నాయి. ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్‌ను ఇటీవల ది సిటీ అసోసియేషన్ గుంటూరు-2 డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జానీబాషా కార్యవర్గం నాయకులు కలిసి సర్కిల్స్ పునర్విభజన లోపాలను సరిదిద్దాలని కోరారు. అలానే నిబంధనలకు విరుద్ధంగా రీజనల్ కార్యాలయాల పేరుతో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినపత్రం అందజేశారు.

బదిలీలు.. పోస్టుల రద్దు

గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి, విజయవాడ, వైజాగ్‌లలో ఏర్పాటు చేసిన రీజనల్ కార్యాలయాల్లో విధులకు డివిజనల్, సర్కిల్స్ కార్యాలయాల నుంచి ఉద్యోగులను బదిలీ చేశారు. బదిలీల్లో కూడా నిబంధనలు పాటించలేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆక్షేపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1157 పోస్టులు రద్దు చేశారు. తద్వారా సర్కిల్స్, డివిజనల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరతతో పనులు కుంటుపడిపోయాయి. మరోవైపు గజిటెడ్ హోదా కలిగిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారులకు సరైన బాధ్యతలు కేటాయించక పోవడంతో ఆ క్యాడర్ నుంచి తగిన ఫలితాలు రాబట్టడంలో వెనుకబడుతున్నారన్న విమర్శలున్నాయి. వారికి కనీసం జాబ్ చార్ట్ కూడా ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి.

మిర్చి కొనుగోళ్లు పెంచేందుకు చర్యలు

జీఏంసీ సెక్రెటరీ వెంకటేశ్వరరెడ్డి ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొనుగోళ్లు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో శీతల గిడ్డంగుల్లో రంగు మారుతున్న మిర్చి అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మార్కెట్‌యార్డుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది రైతులు మిర్చి ధర రాబోయే రోజుల్లో పెరుగుతుందన్న తలంపుతో శీతలగిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి రేటు రకం, నాణ్యతని బట్టి క్వింటాల్‌కి సుమారు రూ. 3 వేల నుంచి రూ. 7 వేల వరకు తగ్గిందన్నారు. రైతులు మిర్చి అధిక దిగుబడి కోసం రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించి ఉన్నారు. దీని వలన శీతల గిడ్డంగిలో ఏడాది కి పైగా నిల్వ చేసిన మిర్చి రంగు మారడంతో పాటు ఫంగస్ చేరుతున్నదన్నారు. ప్రస్తుతం యార్డులో రోజుకు 45 వేల టిక్కీల విక్రయం జరుగుతున్నది. దీని దృష్ట్యా రైతులు మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను గమనిస్తూ గిట్టుబాటు ధరకు మిర్చిని విక్రయించుకొనేదుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



ఆదేశాలు జారీ అవుతున్నాయి...

వైద్య పరికరాలు అందజేస్తున్న ఎన్నారై డాక్టర్ రవికుమార్

జింకానా వైద్యుల సేవలు అభినందనీయం

గుంటూరు (మెడికల్) జూలై 30: ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధికి జింకానా చేస్తున్న సేవలు అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం శుశ్రుతహాల్‌లో జరిగిన కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ త్రిపురనేని రూ.15 లక్షల విలువైన ఎనస్థీషియా వైద్య పరికరాలను ప్రభుత్వాస్పత్రికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జింకానా దాతృత్వంతో ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో రూ.100 కోట్ల భారీ వ్యయంతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణ పనులు సాగుతున్నట్లు తెలిపారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో పేదలకు కూడా కార్పొరేట్ వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో నిరంతరం తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, మత్తు మందు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

గుంటూరు (మెడికల్) జూలై 30: గుంటూరు వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పలు పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎనస్థీషియా టెక్నీషియన్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఫర్ఫ్యూషన్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్, డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆయన వివరించారు. రెండేళ్ల కాల పరిమితి గల ఈ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు ఆరు ఆఖరు తేదీ అని, ఆగస్టు 19న కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రొఫెసర్ టీటీకే రెడ్డి వెల్లడించారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

క్రోసూరు, జూలై 30 : పల్నాడు జిల్లా క్రోసూరు మండల పరిధిలోని విప్పర్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లను బుధవారం స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపల్ రమాదేవి మంగళవారం తెలియ జేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ స్పాట్ అడ్మిషన్‌లకు అర్హులన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో బుధవారం వ్యక్తి గతంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు హాజరు కావాలని తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు పూర్తి ఫీజు రూ 4700, కౌన్సిలింగ్ ఫీజు రూ 1100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కౌన్సిలింగ్ ఫీజు రూ 350 చెల్లిస్తే పోతుందన్నారు. స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. పూర్తి వివరాల కోసం 9440613229 నెంబరులో సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

క్రోసూరు, జూలై 30: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ప్రభుత్వం ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కోటప్పకొండలోని ట్రైనింగ్ సెంటర్ జాబ్స్ కో-ఆర్డినేటర్ మంగళవారం తెలియ జేశారు. శిక్షణా కాలం నాలుగు నెలలు ఉంటుందని, కామన్ సబ్జక్టులుగా కంప్యూటర్ కోర్సు, కంప్యూటర్ టైపింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, జాబ్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్పుతామన్నారు. విద్యార్హత ఏదైనా డిగ్రీ పాసై 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రైవేట్ మల్టీ జ్యువెలర్స్ షోరూంలలో, కస్టమర్ సేల్స్ అసోసియేట్ , సేల్స్ సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్, టీమ్ లీడర్, బిల్లు ఆపరేటర్, టాలీ ఎకౌంటెంట్ ఆపరేటర్ మొదలైన ఖాళీల్లో అవకాశాలు కల్పింస్తామన్నారు. జీతం రూ 15వేలు నుంచి రూ 25వేలు వరకు ఉంటుందని, నిబంధనల ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందని, ఉద్యోగంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అభ్యర్థులకు మాత్రమే ఇక్కడ శిక్షణకు అవకాశం ఉందన్నారు. నరసరావుపేట మండలం కోటప్పకొండ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9010585360 నెంబరులో సంప్రదించాలన్నారు.

బాంబు కేసులో నిందితులు అరెస్టు

దుర్గి, జూలై 30: పల్నాడు జిల్లా దురిగ మండలం జంగమహేశ్వరపాడులో మే 24వ తేదీన టీడీపీ సానుభూతిపరుడు గుమ్మా నాగరాజు ఇంట్లో నాటుబాంబులు, మరణాయుధాలు ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 17వ తేదీన మండలంలోని కాకిరాలకు చెందిన బొజ్జా నాగేంద్రబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో తాజాగా మంగళవారం కాకిరాలకు చెందిన బాణావత్ శ్రీనునాయక్ అలియాస్ లడ్డు శ్రీనును కూడా అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మే 7వ తేదీన జంగమహేశ్వరపాడు శివారులో నాటుబాంబులు, మారణాయుధాలను దాచి అక్కడినుంచి గుమ్మా నాగరాజు గృహానికి చేర్చారన్నారు. సమాచారం తెలుసుకున్న అప్పటి సీఐ చినమల్లయ్య నాటు బాంబులు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈనెల 7వ తేదీన పొలంలో నాటుబాంబు పేలడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారన్నారు. గతంలో గుమ్మా నాగరాజు గృహంలోకి నాటుబాంబులు తరలిస్తున్న సమయంలో ఒక నాటుబాంబు మిగిలిపోయిందని, ఆ బాంబు ఈనెల 7వ తేదీన పొలంలో పేలిందని సీఐ శ్రీనివాసరావు వివరించారు.

టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఏపీసీబీఈఏ

మంగళగిరి, జూలై 30: ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జూన్ 6న గుంటూరులో జరిగిన సమావేశంలో టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఏర్పడినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్ తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళగిరి బ్రాంచి కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకుల ఉద్యోగులు ఇకపై టీఎన్‌టీయూసీకి అనుబంధంగా పనిచేస్తున్న ఏపీసీబీఈఏకు మద్దతుగా ఉంటారన్నారు. రాష్ట్ర కార్యదర్శులు డి.శ్రీనివాస్, జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ నెల్లూరు డీసీసీబీలో ఇటీవల వైఎస్‌ఆర్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కొంతమంది యూనియన్ బైలాకు వ్యతిరేకంగా సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి ఒకరిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోఆప్ట్ చేస్తున్నట్లు ప్రకటించారని, ఇది ట్రేడ్ యూనియన్ బైలాకు పూర్తి విరుద్ధమన్నారు. రాష్ట్ర జనరల్ బాడీలో ఎన్నికైన ప్రధాన కార్యదర్శి రాజీనామా చేయకుండా వేరొకరిని కోఆప్ట్ చేయడం చెల్లదన్నారు. వైఎస్‌ఆర్ టీయూసీకి చెందిన కొంత మంది నాయకులు కార్మిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నామని చెప్పారు. వైఎస్‌ఆర్‌టీయూసీ యూనియన్ నేతల ను ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కానీ, వేతన సవరణ చర్చలకు కానీ ఆహ్వానించవద్దని ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డికి విన్నవించినట్టు తెలిపారు. వైఎస్ ఆర్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కొంత మంది నేతలను అసోసియేషన్ నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు.

45,472 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,204 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 45,472 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,480 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15500	334	10000	15000
నెంబరు. 5	10000	14000	నెంబరు. 5	12000	12000
273	9500	12500	273	11300	14000
341	8500	16500	341	9500	14500
4884	10000	10000	4884	11500	16000
సూపర్ 10	15000	15000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	10300	18400
బ్యాడిగి	9000	14500	బ్యాడిగి	9000	12800
దేవనూరుడీలక్స్	8500	12500	దేవనూరుడీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పారిశుధ్యంపై దృష్టి సారించండి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేవీ సుబ్బారావు

పిడుగురాళ్ల, జూలై 30: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు దృష్టిసారించాలని మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు తెలిపారు. మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యాలయంలో ఏమి జరుగుతుందో తెలియటం లేదని, అలాంటప్పుడు సంతకాలు పెట్టేందుకే రావటమెందుకన్నారు. అన్ని వార్డులలోను దశల వారీగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్యం మెరుగుపరుస్తామని చైర్మన్ సుబ్బారావు, కమిషనర్ గిరికుమార్, ఏఈ రాఘవేంద్ర సభ్యులకు సమాధానం ఇచ్చారు. అనంతరం చైర్‌పర్సన్ చాంబర్‌లో సభ్యులతో సమావేశమైన చైర్మన్ సుబ్బారావు సమావేశానికి సమయ పాలనకు హాజరు అయ్యేలా ఉండాలని సూచించారు.

పింఛన్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మాచవరం, జూలై 30: ఆగస్టు 1వ తేదీన పింఛన్‌ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మండలంలోని గ్రామ సచివాయాల్లో సిబ్బందిని ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. 1వ తేదీన ఉదయం 5గంటలకే పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని, వేరే గ్రామాల్లో ఎవరైనా ఉంటే 1వ తేదీన తప్పనిసరిగా ఆయా గ్రామాలకు చెరుకొని పింఛన్లు తీసుకోవాల్సిందిగా కోరారు. 1వ తేదీన నూరు శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తయ్యేలా పంచాయతీ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ పంపిణీలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా గ్రామాల నాయకులతో పంపిణీ చేసేలా పంచాయతీ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలన్నారు.

● పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం, రూరల్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో 1వ తేదీ ఉదయం 5గంటల నుంచే పింఛన్ పంపిణీ జరగాలని కమిషనర్ గిరికుమార్, ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు. మంగళవారం పింఛన్ పంపిణీకి కేటాయించిన సిబ్బందితో సమావేశం నిర్వహించి పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలన్నారు.

● రాజుపాలెం: ఆగస్టు 1వ తేదీ పెన్షన్‌ను ఉదయం 6గంటలకు ఇళ్ల వద్దకు వచ్చి సిబ్బంది ఇవ్వనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

● కారంపూడి: మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో ఆగస్టు ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ తెలిపారు. పెన్షన్‌దారులు అందుబాటులో ఉండి పెన్షన్ స్వీకరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షన్ దారులకు ఒకటో తేదీన వంద శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలని, గ్రామంలోని పెన్షన్‌దారులంతా నివాసాల వద్ద అందుబాటులో ఉండాలని గ్రామ కార్యదర్శి కసిన్యానాయక్ కోరారు.

పింఛన్ డబ్బు నేడే డ్రా చేయాలి...

నకరికల్లు, జూలై 30: పింఛన్ నిధులను బుధవారమే డ్రా చేయాలని మండల ప్రత్యేక అధికారి బాలూనాయక్ ఆదేశాలు జారీచేశారు. పింఛన్ లబ్దిదారులంతా గ్రామంలో ఉండేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. వంద శాతం ఫించన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి పింఛన్ పంపిణీ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయమణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

నకరికల్లు, జూలై 30: సుభదిన్ బోజన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుంకలగుంట జడ్పీ హైస్కూల్లో కూటమి నేతలు విద్యార్థులకు బత్తాయి పండ్లను పంపిణీ చేశారు. పండ్లను రామిశెట్టి హనుమంతరావు విద్యార్థులకు అందజేయగా ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిస్టర్ కే మేరీరాణి, ఆవుల సుబ్బారావు, ఆవుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సింగరాజు అంకారావు, చేకూరి వెంకటేశ్వర్లు, గోపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 రావిపాటి నరసింహారావు పదవీ విరమణ

అచ్చంపేట, జూలై 30: మండల ఎంఈవో-2 రావిపాటి నరసింహారావు మంగళవారం పదవీవిరమణ చేశారు. ఈ నేపథ్యంలో అచ్చంపేటలోని సాయిబాబా కళ్యాణమండపంలో మండల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 ఏకుల ప్రసాదరావు, ఆళ్ళమూడి వెంకటేశ్వరరావు, వీ గంగయ్య, బీ వాసుబాబు, రాంబాబు, తుమ్మా శౌరిరెడ్డి, సాంబశివరావు, బాషా, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

● అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం
● టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించం
● మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్లు

మాచర్ల, జూలై 30: మాచర్ల పట్టణం 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని, ఇకపై పట్టణాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధంచేసి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీతోపాటు పలుచోట్ల నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేస్తామన్నారు. అక్రమ నిర్మాణాల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మాచర్ల పురపాలకసంఘం అవినీతిలో కూరుకుపోయిందని, రూ.8కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు కూడా అందించలేకపోయారన్నారు. ఏడాదిన్నరలో బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి పట్టణంలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు. కొవిడ్ సమయంలో వచ్చిన నిధులు భారీగా దుర్వినియోగమయ్యాయన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో యంత్రాల ద్వారా పారిశుధ్యంపై దృష్టి సారించాలని, పురపాలక సంఘ కార్మికులు వార్డుల్లో విధులు నిర్వహించేలా చూడాలన్నారు. అవినీతిపై విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన ఎవరినీ ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్లు పచ్చకండువా కప్పుకొని సమావేశానికి హాజరవడం విశేషం. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ వెంకటదాసు, కౌన్సిలర్లు మదార్‌సాహెబ్, యర్రాకుల సిద్ధమ్మ, జగన్‌మోహన్, బుట్టి శ్యామలాజ్యోతి, గోవర్ధని, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన న్యాయాధికారి


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్

దుర్గి, జూలై 30: దుర్గిలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని మంగళవారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను తెలుసుకున్నారు. అనంతరం పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. వసతిగృహంలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, సవరించుకోవాలని వార్డెన్ బెన్‌హర్‌బాబుకు సూచించారు. న్యాయాధికారి వెంట లీగల్ సెల్ సభ్యులు బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరావు, రాధిక, పోలీసు సిబ్బంది ఉన్నారు.

భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే జూలకంటి


జలశక్తి అభియాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

రెంటచింతల, జూలై 30: భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలని, మొక్కలను నాటడమే కాదు సంరక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం రెంటచింతలలో ఉపాధిహామి సిబ్బంది నేతృత్వంలో జలశక్తి అభియాన్ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలని ఇంటింటికి ఇంకుడు గుంతలు, బోర్ల రీచార్జ్, చెరువులు, బావుల్లో పూడిక తీత, కందకాలు తవ్వడం, చెక్‌డ్యామ్‌లు నిర్మించడం, మొక్కలు నాటడం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైఆర్ఎస్ హైస్కూల్‌కు చెందిన వందలాది మంది బాలబాలికలు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరరావు, ఏపీవో జయచంద్ర, హెచ్ఎం చంద్రశేఖరరావు, మల్లిఖార్జునరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, టీడీపీ నేతలు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు


పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

క్రోసూరు, జూలై 30: క్రోసూరు మండలంలో మంగళవారం వివిధ గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. సెక్రటేరియట్ సిబ్బంది, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కూడా పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సచివాలయ కార్యాలయాల ఆవరణలో ఎంపీడీవో కేవీ రమణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో పాటు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో మురుగు కాలువలు శుభ్రం చేశారు. ఎబేట్ ద్రావణాన్ని చల్లించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు కోరారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి

పెదకూరపాడు, జూలై 30: రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని బుచ్చయ్యపాలెంలో రోడ్డుకు ఇరువైపులా జన చైతన్య సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ భూగర్భ జలాలు, అడుగంటిపోతున్నా చెట్లు పెంచకపోగా ఉన్న చెట్లను నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జన చైతన్య సమితి కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు.

డెంగీ నిరోధక మాసోత్సవ ముగింపు సమావేశం

అచ్చంపేట, జూలై 30: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబునాయక్ ఆధ్వర్యంలో డెంగీ నిరోధక మాసోత్సవ ర్యాలీ ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ డెంగీవ్యాధికి తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సుభాన్ మహమ్మద్‌బేగ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్‌కుమార్, పీహెచ్‌సీ శివనాగేశ్వరి, హెచ్ఎస్ రాధాకృష్ణ, హెచ్‌వీ రామకోటమ్మ తదతరులు పాల్గొన్నారు.

1న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమరావతి, జూలై 30: ఆగస్టు 1వ తేదీ గురువారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రాణీ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మానవ అక్రమరవాణాపై అవగాహన ర్యాలీ

అమరావతి, జూలై 30: మానవ అక్రమరవాణాపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పల్లోటి జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐ ఏపీ బ్రహ్మం, కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ విన్నరస్, సిస్టర్ డియాన, సిస్టర్ గ్రేసీ, వినోద్, మానవ అక్రమరవాణా నిరోధకశాఖ సిబ్బంది మంగమ్మ, కోటేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు మానవహారం నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ శ్రీనివాసరావు

మాచర్లటౌన్, జూలై 30: ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెల్దుర్తి మండలం రామచంద్రాపురం తండాలో అలుగు జంతువులు కలిగి ఉన్నారన్న సమాచారంతో సోమవారం అటవీశాఖాధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు అటవీశాఖాధికారులపై దాడి చేసి ఎఫ్ఆర్‌వో సత్యనారాయణరెడ్డిని గాయపరిచారన్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి గానీ అధికారులపై దాడులు చేయడం నేరమన్నారు. ఇటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరిచారు. ఈ సమావేశంలో సీఐ బాలాజీ, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అందరూ కలసి కట్టుగా ఉండాలి : ఎస్ఐ రాజేష్

బెల్లంకొండ, జూలై 30: అందరూ కలసికట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ జెండాచెట్టు వద్ద గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గొడవలు పడి జైలుకు వెళితే జీవితాలు నాశనమవుతాయని, భార్యాపిల్లలు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. పంటపొలాలు బీడుగా మారతాయని, పిల్లల భవిష్యత్ నాశనమైపోతుందని తెలిపారు. గ్రామంలో సమస్యలు ఉంటే ఇరు పార్టీలవారు చర్చించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్ఐ వసంతకుమార్, రమేష్, హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్, కోటేశ్వరరావు, సిబ్బంది ఎల్ వెంకటేశ్వర్లు, మల్లి పాల్గొన్నారు.

గ్రామాల్లో మూడు సెంట్ల స్థల నిర్ణయం హర్షణీయం

క్రోసూరు, జూలై 30: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు గృహ నిర్మాణంకోసం మూడుసెంట్ల స్థలం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించటం హర్షణీయమని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్ల స్థలాలు ఇస్తామని ప్రకటించటం నిరుపేదలకు ఎంతోమేలు చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం లబ్దిదారుల ఎంపిక విషయంలో పక్షపాతంతో వ్యవహ రించిందని, టీడీపీకి చెందిన వారికి పూర్తయిన ఇళ్ళకు కూడా చెల్లింపులు చేయలేదని వారు విమర్శించారు. ఐదేళ్లలో గృహనిర్మాణాల కోసం రూ.88వేల కోట్లు ఖర్చుచేశామని జగన్ ప్రభుత్వం చెప్పటం పెద్ద కుంభకోణం అన్నారు. పోరంబోకు భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటినే ప్రభుత్వానికి నాలుగైదు రెట్ల ఎక్కువ ధరకు అంటగట్టి వైసీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం కొత్తలబ్దిదారులకు మూడుసెంట్ల స్థలాన్ని ఇవ్వాలని నిర్ణయించటం, గృహ నిర్మాణాలకు కూడా నిష్పక్షపాతంగా లబ్దిదారులను ఎంపికచేసేలా చర్యలు తీసుకోవటం నిరుపేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, దుద్దుల యోహాన్, నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షులు తోకా వెంకటరావు, నలజాల కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెల్లజాతి పశువులకు టీకాలు

అచ్చంపేట, జూలై 30: మండలంలోని అన్ని గ్రామాల్లో దశల వారీగా తెల్లజాతి పశువులకు ముద్ద చర్మ వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్టు పశువుల డాక్టర్ శ్వేతాదేవి మంగళవారం తెలిపారు. ముందు జాగ్రత్తగా తెల్ల జాతి పశువులకు వేస్తున్న ఈ టీకాలను పశువులకు వేయించుకోవాలని ఆమె కోరారు.

సొంతింటి కల నెరవేర్చే ఘనత టీడీపీదే

బెల్లంకొండ, జూలై 30: ఇల్లు లేని ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చే ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళవార బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ళ నిర్మాణం చేపట్టే వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.50లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు సూచించారు. అంతేగాకుండా అదనంగా ఉపాధి హామీ పథకం కింద రూ.30వేల నిధులను కేటాయిస్తుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను తప్పక అమలుచేస్తారన్నారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల టీడీపీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, వైస్ సర్పంచ్ సుభానీ, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, గుడిసె కొండయ్య, పీఎస్‌కే రసూల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, ఎన్ పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం

బెల్లంకొండ, జూలై 30: ప్రకృతి వ్యవసాయం రైతు లకు ఎంతో లాభదాయక మని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి అమలకు మారి పేర్కొన్నారు. మంగ ళవారం మండలంలోని నాగిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఘన జీవామృతం చేయటం వల్ల భూమిలో వేరు వ్యవస్థ లోతుగా వెళ్ళి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా పంటలకు తట్టుకొనే శక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీఎం రాజ్‌పవన్, సైదయ్య, సంధ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అమలకుమారి

పాసు పుస్తకాలపై రాజముద్ర

సత్తెనపల్లి, జూలై 30: రాజముద్రలతో భూయజమానులకు పట్టాదారుపాసు పుస్తకాలు అందజేయాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవటంపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో హామీమేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. జగన్ పట్టాదారు పాసుపుస్తకాలపై తన బొమ్మను ముద్రించుకుని రూ.15కోట్ల ప్రజాధనాన్ని ప్రచారం కోసం వృధా చేశారన్నారు. పొలాల సరిహద్దు రాళ్ళపై తన బొమ్మను ముద్రించి జగన్‌రెడ్డి రూ.700కోట్ల ప్రజాధనం వృధా చేశారన్నారు. కృష్ణానదికి వరదనీరు పోటెత్తుతుందన్నారు. అన్నదాతల ఆశలు చిగురించాయని, ఈ సీజన్ తాగు, సాగునీటికి భరోసా లభించిందన్నారు. వారంరోజుల్లో సాగర్‌కు వరదనీరు చేరి డ్యామ్ నిండుతుందన్నారు. దీనివల్ల పల్నాడుజిల్లాలో సాగర్ ఆయకట్టు, ప్రజలకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.

నీరు వృధా కాకుండా చూడాలి

● జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్


రాజుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్, ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది

రాజుపాలెం, జూలై 30: నీరు వృధాకాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాజుపాలెంలో నారి శక్తిసే జల్‌శక్తి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గుంటూరు-మాచర్ల రహదారిపై రాజుపాలెం బస్టాండ్‌సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నీటిని పొదుపు చేద్దాం... భావితరాలను బతికిద్దాం.. అని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. తొలుత వెలుగు ఏపీఎం సునీత, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఈలు నరసింహరావు, భావన తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దు..

దుర్గి, జూలై 30: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని సీఐ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో మందుబాబులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. సీఐ వెంట ఇన్‌చార్జి ఎస్ఐ కుర్రి రాజశేఖర్ ఉన్నారు.

సివిల్ సప్లయి గోడౌన్ పరిశీలించిన ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

మాచర్ల రూరల్, జూలై 30: పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల సివిల్ సప్లయి గోడౌన్‌ను మంగళవారం గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా నిర్దేశిత సమయానికి రేషన్ సరుకులు డిపోలకు చేర్చాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ మురళీధరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నీరే మానవాళికి జీవనాధారం

సత్తెనపల్లి రూరల్, జూలై 30: నీరే మానవాళికి జీవనాధారం అని సర్పంచ్ పేరం శకుంతల అన్నారు. మండలంలోని గుండ్లూరులో మంగళవారం జలశక్తి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నీటి ప్రాముఖ్యతపై పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శి కాశిమాల రాజేష్, పాఠశాల హెచ్ఎం రవిచంద్ర, మాజీ సర్పంచ్ నలజాల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పవన్ కల్యాణ్ నాయకత్వానికి ప్రజా మద్దతు

సత్తెనపల్లి, జూలై 30: రాష్ట్రంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నాయకత్వానికి పెద్దఎత్తున ప్రజామద్దతు లభిస్తుందని జనసేన నియోజకవర్గ కన్వీనర్ బొర్రా వెంకట అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేడు జనసేన సభ్యత్వం మూడు లక్షలకు చేరిందన్నారు. జనసేన క్రియాశీలక సభ్యత్వాలు అధిక సంఖ్యలో నమోదయ్యాయన్నారు.

ఆగస్టు 9న ఢిల్లీలో ధర్నా

సత్తెనపల్లి, జూలై 30: ఆగస్టు 9న ఢిల్లీలో జరిగే మాలల మహాధర్నాకు మాలలంతా హాజరై జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.జాన్‌పాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సత్తెనపల్లిలో కరపత్రాలు జాన్‌పాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నేతలు పాల్గొన్నారు.

విద్యలో రాణించాలి...

రెంటచింతల, జూలై 30: చిన్ననాటి నుంచి చదువు పట్ల మక్కువ పెంచుకోవాలని అప్పుడే మనం అన్ని రంగాల్లో రాణించడానికి అవకాశం ఉంటుందని పరాశక్తి సిమెంట్స్ వైస్ ప్రసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు కోరారు. మంగళవారం మండలంలోని మల్లవరం, జెట్టిపాలెం, గోలి, పశర్లపాడు తదితర గ్రామాల్లోని పాఠశాలలకు చెందిన 560మంది బాలబాలికలకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎం జి.చంద్రశేఖరరెడ్డి, డీజీఎం ఏ.వెంకట్రావ్, పీఆర్వో మల్లిఖార్జునరావు, వేణుగోపాలరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

నేడు సీపీఐ కౌన్సిల్ సమావేశం

కారంపూడి, జూలై 30: పట్టణంలోని డాక్టర్ ఆదినారాయణ ఇంటి వద్ద బుధవారం సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ హాజరవుతారన్నారు.

పాఠశాలలో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

కారంపూడి, జూలై 30: పాఠశాలలో పరిశుభ్రతపై దృష్టిపెట్టాలని నేషనల్ యాంటీ క్రైం హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు గరికపాటి శంకరరావు అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చీదెళ్ల మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీ కాకుమాను శ్రీనివాసరావు, కోశాధికారి కోట బాబురావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాలా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



జాతీయ క్రీడల్లో రాణించిన బాలికలను అభినందిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

విద్యార్థులు లక్ష్యాలను పట్టుదలతో సాధించాలి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

శావల్యాపురం, జూలై 30: విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషిచేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి పాల్గొని ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన 9మంది విద్యార్థులను, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ తరపున విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. డీవైఈవో వేణుగోపాలరావు, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సాంఘీక సంక్షేమ శాఖ అధికారుల తనిఖీ

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

వినుకొండ టౌన్, జూలై 30: వినుకొండ సిద్దార్థనగర్‌లోని సాంఘీక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురించిన హాస్టల్‌లో సంక్షేమం కరువు అనే కథనంపై పల్నాడు జిల్లా సాంఘీక సంక్షేమ అధికారులు స్పందించారు. జిల్లా అధికారి ఓబుల్ నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఏఎస్‌డబ్ల్యూ సంతోష్ హాస్టల్‌లో తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులను కలుసుకుని జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులతో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. విచారణ అనంతరం పూర్తిస్థాయి నివేదికను జిల్లా అధికారి ఓబులునాయుడుకు అందచేస్తానని సంతోష్ తెలిపారు.

గొరిచెన్ గ్లేసియర్‌ను అధిరోహించిన ఎన్ఈసీ కేడెట్స్



నరసరావుపేట కల్చరల్, జూలై 30: పట్టణంలోని ఎన్ఈసీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు అరుదైన ఘనతను సాధించారు. మంచు పర్వతం అధిరోహించి కళాశాల ఖ్యాతిని దశదిశలా చాటారు. కళాశాల ఎన్‌సీసీకి చెందిన కేడెట్స్ సుస్వంత్, ఆర్తిలు అతి క్లిష్టమైన, సుమారు 3200 మీటర్ల ఎత్తులో ఉన్న గొరిచెన్ గ్లేసియర్‌ను అధిరోహించి, మంచు పర్వతంపై ఎన్‌సీసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ ఘనత సాధించిన సుస్వంత్, ఆర్తిలను మంగళవారం కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, ఇతర కళాశాలల సిబ్బంది అభినందించారు.

'ఇంటిని కూల్చిన వారిపైచర్యలు తీసుకోవాలి'

నరసరావుపేట టౌన్, జూలై 30: రొంపిచర్ల మండలం గోగులపాడులోని తమ గృహాన్నీ ప్రొక్లెయిన్‌తో కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇల్లు కూల్చివేతపై రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని అన్నారు. కాని ఇంతవరకు నిందితులపై ఏ చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మునిసిపల్ షెడ్లపై రేకుల అపహరణ

● రూరల్ పోలీసు స్టేషన్ పక్కనే ఘటన ● చోద్యం చూస్తున్న అధికారులు



రేకులు అపహరణకు గురైన మునిసిపల్ షెడ్లు

నరసరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆస్తులను పరిరక్షణలో మునిసిపాల్టీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మునిసిపాల్టీకి సంబంధించిన రేకులను అగంతకులు అపహరించారు. రూరల్ స్టేషన్ పక్కనే ఈ సంఘటన చోటు చేసుకుంది. రూరల్ స్టేషన్ పక్కన మునిసిపాల్టీ రైతు బజారు కోసం రూ.10లక్షలు వెచ్చించి రేకుల షెడ్లు నిర్మించింది. దీనిని 2019లో టీడీపీ కౌన్సిల్ ప్రారంభించింది. గత ఐదేళ్ల రైతుబజారు నిర్వహించకుండా షెడ్లను మునిసిపాల్టీ పాడుబెట్టింది. మూడుషెడ్లు ఉండగా రెండు షెడ్లకు సంబంధించిన రేకులను అపహరించారు. దీనిపై మునిసిపాల్టీ అధికారులను వివరణ కోరగా ఈ సంఘటన తమ దృష్టికి రాలేదని తెలియజేయడం గమనార్హం. ఇప్పటికైనా సదరు రేకుల షెడ్లను మునిసిపల్ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. రేకుల అపహరణపై కనీసం పోలీసులకు ఫిర్యాదు కూడా చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది.



వినుకొండ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

కౌన్సిలర్లకు, అధికారులకు ఎమ్మెల్యే జీవీ సూచన



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూలై 30: అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి వినుకొండ పట్టణాభివృద్ధి కృషి చేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పురపాలక సంఘం కార్యాలయంలో డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 46 అంశాలలో, వాహనాల రిపేరు సంబంధించిన రెండు అంశాలు మినహా, మిగిలిన 44 అంశాలను కౌన్సిల్‌లో తీర్మానం పొందాయి. సమావేశంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండలో పారిశుధ్య పనులకు కొత్తగా నిధులు సమకూర్చిన, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరలో వార్డుల్లో అధికారులు పర్యటించి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏడీఏ కిరణ్‌ను ఆదేశించారు. పట్టణంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిన విద్యుత్‌శాఖ అధికారులు మీటర్ల ఏర్పాటులో డబ్బు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేసే వారిని ఇంటి పంపిస్తామని విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. రోజు మార్చి రోజు నీటిని అందించాలని, నీటి సరఫరా చేసే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఎప్పుడెప్పుడు నీటిని సరఫరా చేస్తారో, ముందుగా వార్డులో ప్రజలకు సమాచారం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

అప్పుల్లో పురపాలక సంఘం: ఛైర్మన్ దస్తగిరి

వినుకొండ పురపాలక సంఘం అప్పుల్లో కూరుకు పోయిందని, పనులు చేసిన బిల్లులు వచ్చే పరిస్థితి లేదని, కొత్త పనులు జరుగుతాయనే ఆశ కౌన్సిలర్లకు, ఛైర్మన్‌గా నాకు కూడా లేదని పురపాలక సంఘం ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి నిర్వేదం వ్యక్తం చేశారు. ముందుగా తొలి ఏకాదశి పండుగ సందర్భంగా కొండపై ఏర్పాట్లకు సంబంధించి, దేవదాయశాఖ భరించాల్సి ఉండగా, మున్సిపాల్టీ నుంచి చెల్లించటంపై 8వ వార్డు కౌన్సిలర్ బ్రహ్మయ్య ప్రశ్నించారు. గతంలో కొండపై పెట్టిన ఖర్చులు, గిరి ప్రదర్శన తదితర ఖర్చులపై ప్రశించలేదేమని 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. గత మూడేళ్ళల్లో మున్సిపాల్టీనీ అప్పులపాలు చేశారని, ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకయ్య, మేనేజర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోటులు పంపిణీ చేస్తున్న పుల్లారావు

కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యల ప్రస్తావన

చిలకలూరిపేట, జూలై 30: చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ప్రశాంతంగా జరిగింది. సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు పలు సమస్యలను లేవనెత్తారు. 37వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పాములపాటి శివకుమారి చిలకలూరిపేట తాగునీటి చెరువుకు సాగర్ కాలువ నీటితో నింపే విషయంపై విజిలెన్స్ దర్యాప్తు జరపాలని కోరారు. సంవత్సరానికి ఆరుసార్లు ప్రతిసారి రూ.45 లక్షలు చొప్పున నిధులు వాడారన్నారు. ప్రస్తుతం రూ.35లక్షలకే నీటిని నింపటం జరుగుతున్నదన్నారు. ఆరుసార్లకు బదులు మూడుసార్లు చెరువును నింపితే సరిపోతుందని, వీటిలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. పట్టణమంతా కుక్కల సంఖ్య పెరిగిందని, రేబిస్ ఇంజక్షన్‌లు కూడా ఆస్పత్రుల్లో అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 34వ వార్డు కౌన్సిలర్ కోట్యానాయక్ మాట్లాడుతూ నరసరావుపేట సెంటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగి పోయాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స కోసం ఎవరు వెళ్ళినా గుంటూరు ఆస్పత్రికి పంపుతున్నారన్నారు. టీడీపీ కౌన్సిలర్ కూనల ప్రమీల మాట్లాడుతూ పలుచోట్ల తాగునీటి పైపులైన్‌లకు లీకేజీలు మురుగు నీరు చేరుతుందన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ డీఈ రమణ మాట్లాడుతూ వారం రోజుల్లో పైపులైన్‌లలో ఉన్న లీకేజీలను సరి చేస్తామని చెప్పారు.

ప్రత్తిపాటికి సన్మానం

కాగా శాసన సభ్యుడిగా ఎన్నికైన అనంతరం ప్రత్తిపాటి పుల్లారావు మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి పప్రథమంగా రావటంతో ఆయనకు కౌన్సిల్‌లో ఆత్మీయ సత్కారం లభించింది. మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫానీ మునిసిపాలిటీ తరుపున ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ మురుగు కాలువల నిర్వాహణకు రూ 90 లక్షలు మంజూరు చేయించామని, మునిసిపల్ ఉద్యోగులు, వివిధ రకాల సిబ్బంది విధి నిర్వహణలో కచ్చితంగా వ్యవహరించాలని అన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు.

మునిపిపల్ పారిశుధ్య కార్మికులకు కౌన్సిలర్ సాయం

మునిసిపల్ పారిశుధ్య కార్మికులు వంద మందికి 21వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కనమర్లపూడి లక్ష్మి ఆర్థిక సాయంతో రెయిన్ కోట్‌లు, హెల్మెట్ మాస్కులు సమకూర్చారు. వీటిని శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు కార్మికులకు పంపిణీ చేశారు. సమావేశంలో కమిషనర్ గోవిందరావు, డీఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రగిరి జెస్టిస్‌కు భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవ్ అవార్డు



అవార్డుకు ఎంపికైన ప్రకృతి కాంత చిత్రం

వినుకొండ, జూలై 30: కోనసీమ చిత్రకళా పరిషత్ ఈ నెల 30వ తేదీన నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో తాను చిత్రించిన ప్రకృతి కాంత చిత్రానికి భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవ్ అవార్డు లభించినట్లు వజ్రగిరి జస్టిస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఆరు అంతర్జాతీయ అవార్డులు అందుకున్నానని, ఏడో అంతర్జాతీయ అవార్డు తన జీవిత ధ్యేయమైన బహుమతి కోసం ఎంతో శ్రమించానని తెలిపారు. ఇప్పటివరకు 52 జాతీయ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణంలోని రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారులు, పాస్టర్లు న్యాయవాదులు, ఉపాధ్యాయులు, కళా సంస్థల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

పోలీసు స్టేషన్‌లలో ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, యడ్లపాడు జూలై 30: పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు మంగళవారం చిలకలూరిపేట నియోజక వర్గంలోని పోలీసు స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిలకలూరిపేట అర్బన్, చిలకలూరిపేట రూరల్, నాదెండ్ల, యడ్లపాడు పోలీసు స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా స్టేషన్‌లలో కేసుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల విషయంలో చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలని ఆయన సీఐ, ఎస్ఐలను ఈ సందర్భంగా కోరారు. యడ్లపాడు పోలీసుస్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్ఐ బలరామిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డిలతో సమావేశమై మండలంలో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా విలేకరులు మండలంలో నేరాల సంఖ్య అధికమైందని, ప్రధానంగా రాత్రి, పగలు తేడా లేకుండా చోరీలు జరుగుతున్నాయని ఎస్పీ దృష్టికి తెచ్చారు. స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే సమస్యను పరిష్కరించి నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆకట్టుకున్న సంఘం శరణం గచ్ఛామి నాటకం

నరసరావుపేట కల్చరల్, జూలై 30: బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ జీవితం, నిమ్నజాతుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని వివరిస్తూ ప్రదర్శించిన నృత్యరూపక నాటకం సంఘం శరణం గచ్ఛామి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో జరిగిన ఈ నాటకం ఆద్యంతం ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేసింది. నాటకాన్ని కె.దేవేంద్ర రచించగా, తూము శివప్రసాద్ దర్శకత్వం వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 600కు పైగా ప్రదర్శనలు పూర్తి చేసుకున్న ఈ నాటకాన్ని అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారు ప్రదర్శించారు. ప్రజా నాట్య మండలి పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నాటక ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు. నాటక ప్రదర్శనను ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తిలకించారు.

గుట్కా వ్యాపారంలో ఆధిపత్యం కోసం వ్యాపారిపై దాడి

నరసరావుపేట లీగల్, జూలై 30: పట్టణంలో నిషేధించిన గుట్కా వ్యాపారంపై ఆధిపత్యం కోసం వ్యాపారిపై మంగళవారం దాడి జరిగింది. పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని నోముల మల్లికార్జునరావు గృహంపై పట్టణానికి చెందిన తలం పూర్ణచంద్రరావు, నరేంద్రకుమార్, తమ్మిశెట్టి ధనరాజు, సింహాద్రి గంగాధరరావు మరికొందరు దాడికి పాల్పడ్డారు. నోముల ఇంటి ఆవరణలోని పూల మొక్కలను పీకివేశారు ఇంట్లోని సామగ్రిని రోడ్డుపై వేశారు ఈ వ్యవహారం మొత్తం సీసీ పుటేజ్‌లో నమోదైంది. టీడీపీకి చెందిన క్రియాశీలక కార్యకర్తలు గుట్కా వ్యాపారంపై ఆధిపత్యం కోసం పోరాటం చేస్తుంటే పోలీసులు వారిపై కేసులు నమోదు చేయకపోవటం గమనార్హం. దాడుల విషయంపై మొదటిపట్టణ సీఐను వివరణ కోరగా నోముల మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి సీసీ పుటేజ్ ఆధారంగా నిందితులందరిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మహంకాళి అమ్మవారి దేవస్థానం ఆదాయం రూ.10.36 లక్షలు

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), జూలై 30: మండలంలోని ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించగా రూ.10,36,750 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు. ఆలయంలో సుమారుగా 120 రోజుల కాలవ్యవధిలో హుండీలను తెరచి లెక్కించినట్లు తెలిపారు. ఆలయంలోని ప్రదాన హుండీల ద్వారా రూ.8,69,900, అన్నదాన హుండీల ద్వారా రూ.1,66,850 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారి ఎం.మంజూష, ములకలూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, మహంకాళి అమ్మవారి దేవస్థానం సేవామండలి సభ్యులు పాల్గొన్నారు.

రిలయన్స్ మార్ట్‌లో తూనికలు కొలతల శాఖ అధికారుల దాడులు

నరసరావుపేట లీగల్, జూలై 30: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని రిలయన్స్ మార్ట్‌పై దాడిచేసి తనిఖీ నిర్వహించారు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్న వస్తువులకు రిలయన్స్ మార్ట్‌లో ఉన్న వస్తువులకు తేడా ఏమైనా ఉన్నదా అన్న విషయం గమనించడానికి శాంపుల్ తీసి పౌరసరఫరాల శాఖ అధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు కంది పప్పు బియ్యం తదితర నిత్యావసర వస్తువులు మార్కెట్ ధరకు వ్యత్యాసం ఉందేమో విచారించి అటువంటిదేమీ లేదని నిర్ధారించినట్లు చెప్పారు ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు సరుకులను విక్రయిస్తుంటే తమ దృష్టికి తేవాల్సిందిగా ఆయన కోరారు.

ఇసప్పాలెం మహంకాళి అమ్మవారికి హిజ్రాల ఆషాడం సారె

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), జూలై 30: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా నరసరావుపేట డివిజన్ పరిధిలోని 150మంది హిజ్రాలు మంగళవారం అమ్మవారికి ఆషాడం సారెను అందజేశారు. నరసరావుపేట పట్టణం నుంచి 150మంది హిజ్రాలు కాలినడకన మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఆషాడం సారెను సమర్పించారు. ఆలయానికి విచ్చేసే భక్తులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు.

రొంపిచర్ల పీహెచ్‌సీలో వైద్యశాఖ అధికారుల తనిఖీ

రొంపిచర్ల, జూలై 30: మండలంలోని రొంపిచర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వరరావులు మంగళవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధిచెందకుండా మందు చల్లే విధానాన్ని పరిశీలించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ రాకుండా చూడాలని వైద్యాధికారి, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జగన్‌నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను పెంపొందించేందుకు సహకరించాలి: ఎంపీడీవో కవితాచౌదరి

శావల్యాపురం, జూలై 30: వర్షపునీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకిపోయేట్లు చేసి భూగర్భ జలాలను పెంపొందింపజేసేందుకు ప్రజలంతా తమవంతు కృషి చేయాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. జల శక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక మండలపరిషత్ కార్యాలయం నుంచి శావల్యాపురం సెంటర్ వరకు అధికారులంతా కలసి మంగళవారం ర్యాలీని నిర్వహించారు.

మైనింగ్‌పై రైతుల ఫిర్యాదు.. నరసరావుపేట ఆర్డీవో తనిఖీ

చిలకలూరిపేట, జూలై 30: చిలకలూరిపేట మండలం యడవల్లిలో అనుమతులు ఇచ్చిన దానికంటే ఎక్కువగా మైనింగ్ చేస్తున్నట్టు ఆ గ్రామ దళిత రైతు కాకాని రోశయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు మంగళవారం నరసరావుపేట ఆర్డీవో సరోజ, మైనింగ్ అధికారి నాగిని, ఇతర శాఖల అధికారులు యడవల్లిలో విచారణ జరిపారు. సర్వే నెంబర్లు తప్పులుగా చూపి ఎడాపెడా మైనింగ్ చేస్తున్నారని ఈ సందర్భంగా రైతులు ఆరోపించారు. అనుమతి ఇచ్చిన దానికంటే ఎక్కువగా మైనింగ్ చేస్తున్నారని రైతులు ఆరోపించారు. పట్టా భూములను కూడా కలుపుకొని తవ్వకాలు జరుపుతున్నారని రైతులు ఆరోపించారు. భూములకు సంబంధించి హద్దులను గుర్తించాలని వారు కోరారు. అధికారులు స్పందించకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు. ఏపీ రాష్ట్ర కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, యడవల్లి సొసైటీ రైతులు కే.శివయ్య, సంషేన్ వెంకటస్వామి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. చిలకలూరిపేట డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ భాగ్యలక్ష్మి అధికారుల వెంట వచ్చారు.

తాగునీటి అవసరాలు తీర్చేందుకు బోర్లు ఏర్పాటు

బోయపాలెం (యడ్లపాడు), జూలై 30: బోయపాలెం ముస్లిం కాలనీ, బీసీ కాలనీ ప్రజల తాగునీటి అవసరాల కోసం మూడు బోర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు పేర్కొన్నారు. మండలంలోని బోయపాలెం ముస్లిం కాలనీలో నీటి అవసరాల కోసం నూతనంగా ఏర్పాటుచేయనున్న బోర్‌వెల్‌కు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయపాలెం గ్రామస్థులు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకురాగా మండల పరిషత్ ద్వారా నిధులు మంజూరు చేయించారన్నారు. ముస్లిం కాలనీలో రెండు, బీసీ కాలనీలో ఒక బోరును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ రాజామహమ్మద్, ఉపాధ్యక్షుడు బద్దుల నరసయ్య దరియావలి, అల్లాభక్షు, మాబువలి, జానీ తదితరులు పాల్గొన్నారు.

మూగచింతలపాలెం చెరువుకు గండి



చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

బొల్లాపల్లి, జూలై 30: మండలంలోని మూగచింతలపాలెం చెరువుకు గండిపడి నీరు వృథాగా పోతోంది. దీనికి అనుకొని ఉన్న పొలాల్లోకి నీరు వెళ్ళటంతో పాటు సమీప గ్రామమైన వడ్డెగుంట గ్రామం కూడా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని మూగ చింతలపాలెం గ్రామస్థులు తెలిపారు. సంబంధితశాఖ అధికారులు చెరువు కట్టను పరిశీలించి చెరువుకు పడిన గండిని పూడ్చాలన్నారు. మూగచింతలపాలెం పంచాయతీ కార్యదర్శి కొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్‌లు గండి ప్రాంతాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఉన్నతాధికారులు స్పందించి గండిని పూడ్చాలని, నీరు వృథాగా పోకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నవోదయలో ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

చిలకలూరిపేట, జూలై 30: చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన క్లస్టర్ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ముగిసింది. విజేతలకు ముఖ్య అతిథిగా చిలకలూరిపేట పండరీపురం బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ రోహిత్ సిన్హా ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు. ఈ ప్రదర్శనలో విజేతలైన విద్యార్థులు కేరళలోని అలప్పీ నవోదయ విద్యాలయంలో జరిగే ప్రదర్శనలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటారని ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు మొత్తం తొమ్మిది నవోదయ విద్యాలయాలకు చెందిన 63 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేత

చిలకలూరిపేట, జూలై 30: ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన సౌత్ జోన్ స్కూల్ కబడ్డీ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి పట్టణంలో మంగళవారం అభినందన సభ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ పోటీలు అండర్ - 14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం, అండర్ - 17 బాలికల విభాగంలో ద్వితీయ స్థానాన్ని, అండర్ - 17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్టు అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ గురునాథ్ తెలిపారు. స్థానిక నారాయణ హైస్కూల్‌లో వీరికి అభినందన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు శేషగిరి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కృపారావు, ప్రవీణ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.